క్లుప్తంగా

గ్యార్మీ వేడుకల్లో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిని సన్మానిస్తున్న ముస్లింలు

మిర్యాలగూడ: పట్టణంలోని బాపూజీనగర్ 7వ వార్డులో గల దర్గా వద్ద శనివారం రాత్రి గ్యార్మీ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొని ముస్లింలతో కలిసి ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాతూరి ప్రసాద్, కొమ్మన నాగలక్ష్మి, పాతూరి శరత్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎన్ఎస్ఎస్ శిబిరం



రోడ్డు శుభ్రం చేస్తున్న వలంటీర్లు

దేవరకొండ: దేవరకొండ ఎంకేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్– 1, 2 యూనిట్ విభాగాల ఆధ్వర్యంలో చేపట్టిన ప్రత్యేక శిబిరాలు కొనసాగుతున్నాయి. ఆదివారం దేవరకొండ మండల పరిధిలోని ముదిగొండ, కమలాపూర్ గ్రామాల్లో చేపట్టిన కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు రోడ్లు శుభ్రం చేసి గ్రామాల్లో చెత్తా చెదారం తొలగించారు. ఈ సందర్భంగా ఎడ్యుకేషన్‌కు సంబంధించి ఇంటింటి సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు, వలంటీర్లు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న శ్రీనివాస్ యాదవ్

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ పట్టణంలోని బాపూజీనగర్ 7, 21వ వార్డుల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు దీపావళి సందర్భంగా బీఆర్ఎస్ పట్టణ అధికార ప్రతినిధి పిన్నబోయిన శ్రీనివాస్ యాదవ్ దంపతుల ఆధ్వర్యంలో నూతన దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం



విద్యార్థులను అభినందిస్తున్న సీఐ

దేవరకొండ: ఆత్మరక్షణకు కరాటే ఎంతగానో దోహదపడుతుందని సీఐ వెంకట్‌రెడ్డి అన్నారు. కరాటే మాస్టర్ గోపి పర్యవేక్షణలో దేవరకొండ నియోజకవర్గ పరిధిలోని ఆయా మండలాలకు చెందిన విద్యార్థులకు ఆదివారం కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆత్మరక్షణ విద్యను అభ్యసించాలన్నారు. కరాటే సాధనతో మానసికంగా, శారీరకంగా ధృడంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌విటీ, తాళ్ల సురేష్, ఆంజనేయులు, లచ్చిరాం, లక్పతి తదితరులున్నారు.

కరాటేలో బంగారు పతకాలు



పతకాలతో సుదీక్ష, విహాస్

పెద్దవూర: మండలంలోని చలకుర్తి గ్రామానికి చెందిన అక్కాతమ్ముడు కరాటేలో బంగారు పతకాలు సాధించారు. ఆదివారం హైదరాబాద్ కూకట్‌పల్లిలో నిర్వహించిన కరాటే స్టేట్ చాంపియన్‌షిప్‌లో భాగంగా గ్రామానికి చెందిన పాతనబోయిన సంతోష్‌కుమార్ కుమార్తె పాతనబోయిన సుదీక్ష, విహాస్ కుముతే, కటా విభాగంలో బంగారు పతకాలు గెలుపొందారు.

రైతు కష్టం నీటిపాలు

- నిడమనూరు పీఏసీఎస్‌లో ప్రారంభం కాని ధాన్యం కొనుగోళ్లు
- మార్కెట్‌లోనే పడిగాపులు కాస్తున్న రైతులు
- కురుస్తున్న వర్షాలకు తడుస్తున్న ధాన్యం



నిడమనూరు మార్కెట్‌లో ఆరబోసిన ధాన్యం

నిడమనూరు: నిడమనూరులో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మార్కెట్‌లో పోసిన ధాన్యం తడుస్తోంది. మండలంలోని ఎర్రబెల్లి, వెంకటాపురం, మారుపాక గ్రామాల రైతులు పదుల సంఖ్యలో నిడమనూరు పీఏసీఎస్ మార్కెట్‌లో ధాన్యం పోశారు. సరిపడా పట్టాలు లేకపోవడంతో రైతుల ధాన్యం వర్షానికి తడివడంతోపాటు, వరదకు కొట్టుకుపోతోంది. ఆదివారం మధ్యాహ్నం సమయంలో వచ్చిన వర్షానికి 40 నుంచి 50 బస్తాల ధాన్యం కొట్టుకుపోయింది. నాలుగైదు రోజులుగా మార్కెట్‌లో పడిగాపులు కాస్తున్నా కొనుగోలుపై కనీసం సమాచారం అందించడం లేదని రైతులు వాపోతున్నారు. వెంటనే ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలని, మార్కెట్ అధికారులు మిల్లర్లతో మాట్లాడి తడిసిన ధాన్యం కొనుగోలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



నిడమనూరు మార్కెట్‌లో తడిసిన ధాన్యం

వారం రోజులవుతోంది



మార్కెట్‌లో ధాన్యం పోసి వారం రోజులవుతోంది. నాకున్న ఆరు ఎకరాల్లో ఎంటీయూ–1010 ధాన్యం సాగు చేశాను నిడమనూరు మార్కెట్‌లో పోశాం. వర్షానికి పది బస్తాల ధాన్యం కొట్టుకుపోయింది.

ఉగ్గిడి లింగయ్య, రైతు, సోమవారిగూడెం

మార్కెట్‌లో వసతులు మెరుగుపరచాలి



నాకున్న ఐదు ఎకరాల్లో పండించిన దొడ్డు ధాన్యం విక్రయ కేంద్రానికి తీసుకరాగా, వర్షానికి 8 బస్తాలు కొట్టుకుపోయాయి. వెంకటాపురం, వంగాలవారిగూడెం గ్రామాల నుంచి 20 మందికి పైగా రైతులు నిడమనూరు మార్కెట్‌లో ధాన్యం ఆరబోయగా వర్షానికి తడిసిపోయాయి. మార్కెట్ అధికారులు కనీసం పట్టాలు కూడా ఇవ్వడం లేదు. – సింగం జయమ్మ, వెంకటాపురం

‘మన బడి’పై నీలినీడలు



కొండమల్లేపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో నిలిచిపోయిన నిర్మాణ పనులు

- గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన మన ఊరు– మన బడికి విడుదల కాని నిధులు
- ఇప్పటికే 80 శాతం పూర్తయిన పనులు
- నిధులు లేవంటూ కాలయాపన

కొండమల్లేపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు తరగతులు నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పనకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ‘మన ఊరు మన బడి’ పథకంపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఈ పథకం కింద కొండమల్లేపల్లి మండలంలో పది పాఠశాలల్లో ఇప్పటికే 80 శాతం పనులు పూర్తయ్యాయి. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకంపై మిన్నకుండడంతో పథకం అమలుపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

10 పాఠశాలల్లో మన ఊరు మన బడి

కొండమల్లేపల్లి మండలంలోని పది పాఠశాలలను మన ఊరు మన బడి పథకం కింద అదనపు తరగతి గదుల నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పనకు గాను రూ.3.42కోట్ల అంచనా వ్యయంతో పనులు ప్రారంభించారు. తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ పథకానికి పెద్దగా ప్రాధాన్యత ఇవ్వలేదు. 80 శాతం మేర పనులు పూర్తి చేసుకుని చివరి దశలో ఉన్న పనులకు నిధుల కేటాయింపులో జాప్యం కారణంగా భవనాలు తుదిమెరుగులు దిద్దుకోలేక పోతున్నాయి.



కొత్తబావిలో 80 శాతం పూర్తయిన భవనం

నిధుల విడుదల కాక నిర్మాణాలు నిలిచిపోయాయి

మన ఊరు– మన బడి పథకం కింద నిర్మాణంలో ఉన్న భవనాలు నిధులు విడుదల కాకపోవడంతోనే పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. చేసిన పనులకు కూడా బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు నిలిపివేశారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం.

– లింగారెడ్డి, పీఆర్‌డీఈ

నూతన భవనాలు సైతం చివరి దశలోనే..

కొండమల్లేపల్లి మండలంలోని గుడితండా, రాములుగుండ్ల తండా, గాజినగర్, రమావత్‌తండా ప్రాథమిక పాఠశాల్లో మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా మూత్ర శాలల నిర్మాణం, విద్యుత్ మరమ్మతులు, పెయింటింగ్, నీటి సరఫరా, ఇతరత్ర మెటీరియల్ కొనుగోళ్లకు సంబంధించి ఇప్పటికే పనులు సైతం పూర్తి కాగా కొండమల్లేపల్లి ప్రాథమిక పాఠశాలలో నూతన భవన నిర్మాణం చేపట్టాల్సి ఉండగా ఇప్పటి వరకు పనులు ప్రారంభం కాలేదు. అదేవిధంగా కొత్తబావి, గుమ్మడవెల్లి, పెండ్లిపాకల, కొండమల్లేపల్లిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణం ఇప్పటికే 80 శాతం పూర్తి కాగా తలుపులు, కిటికీలు వంటి చిన్న చిన్న పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ పనులకు సంబంధించి బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో కాంట్రాక్టర్లు పనులు నిలిపివేశారు.

చింతకుంట్లకు మంజూరైన భవనం.. గుమ్మడవెల్లికి మార్పు

చింతకుంట్ల ప్రాథమిక పాఠశాలకు అదనపు తరగతి గది నిర్మాణం మంజూరు కాగా ఈ పాఠశాలలో తరగతి గదులన్నీ రేకులషెడ్డులో కొనసాగుతున్నాయి. ఇక్కడ స్థలం సరిపోదనే సాకుతో ఈ భవనాన్ని గుమ్మడవెల్లికి మార్పు చేశారు. వాస్తవానికి చింతకుంట్లలో ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రెండు ఒకే చోట కొనసాగుతున్నాయి. చింతకుంట్లలో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నప్పటికీ గుమ్మడవెల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో నూతన భవనాన్ని నిర్మించడంలో కొందరు రాజకీయ కోణం ఉన్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఏఎమ్మార్పీ కాలువలో పడి వ్యక్తి గల్లంతు



హర్షద్ (ఫైల్)

పెద్దఅడిశర్లపల్లి : ఏఎమ్మార్పీ ప్రధాన కాలువలో పడి వ్యక్తి గల్లంతైన సంఘటన పెద్దఅడిశర్లపల్లి మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. గుడిపల్లి ఎస్ఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ చెంచల్‌గూడకు చెందిన సయ్యద్ హర్షద్ (45) ఆదివారం తన స్నేహితులతో కలిసి మండలంలోని ఏఎమ్మార్పీ పరిధిలోని అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ హెడ్‌రెగ్యులేటర్ వద్ద గల ఏఎమ్మార్పీ ప్రధాన కాలువకు చేపల వేటకు వచ్చాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి ప్రధాన కాలువలో పడిపోయాడు. గమనించిన స్నేహితులు పోలీసులు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఎస్ఐ నర్సింహులు ఏఎమ్మార్పీ అధి కారులతో మాట్లాడి నీటి సరఫరా నిలిపివేసి గాలింపు చర్యలు చేపడుతున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి



అర్జున్ (ఫైల్)

పెద్దఅడిశర్లపల్లి: గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన కోదాడ–జడ్చర్ల జాతీయ రహదారిపై పెద్దఅడిశర్లపల్లి మండలం ఘనపురం గ్రామ స్టేజీ సమీపంలో ఆదివారం జరిగింది. గుడిపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుడిపల్లి మండలం కోదండాపురం గ్రామానికి చెందిన మైనం అర్జున్(24) హైదరాబాద్‌లో బీటెక్ పూర్తిచేసి కోచింగ్ తీసుకుంటున్నాడు. దీపావళి పండుగకు స్వగ్రామమైన కోదండాపురానికి స్కూటీపై హైదరాబాద్ నుంచి వస్తున్నాడు. మార్గమధ్యలో కోదాడ–జడ్చర్ల జాతీయ రహదారిపై పెద్దఅడిశర్లపల్లి మండలం ఘనపురం గ్రామ స్టేజీ సమీపంలోకి రాగానే గుర్తుతెలియని వాహనం స్కూటీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అర్జున్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అతడిని హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నర్సింహులు తెలిపారు.

ఆటోను ఢీకొన్న ట్రాక్టర్

- ఒకరు మృతి, నలుగురికి గాయాలు
- నిడమనూరు మండలంలోని ముప్పారం గ్రామ శివారులో ఘటన



ధ్వంసమైన ఆటో

నిడమనూరు : ఆటోను ట్రాక్టర్ ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా, నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఆదివారం నిడమనూరు మండలంలోని ముప్పారం గ్రామానికి పలువురు కూలీలు అదే గ్రామానికి చెందిన ఆటోలో పెద్దవూర మండల శివారులో పత్తి తీసేందుకు వెళ్లారు. సాయంత్రం తిరిగి వస్తుండగా.. ముప్పారం శివారులో ఎదురుగా ధాన్యం లోడ్‌తో వస్తున్న ట్రాక్టర్ వీరి ఆటోను ఢీకొన్నది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఆదిమళ్ల సాయిలు(65) తీవ్రగాయాలతో మృతి చెందాడు. కత్తుల కర్రెమ్మ, ఆదిమళ్ల వెంకటమ్మ, కత్తుల రాములమ్మ, ముడి పరుశురాములు తీవ్ర గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ ఉప్పు సురేష్ పరిశీలించారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

మిర్యాలగూడ: దామరచర్ల మండలంలోని మూసీ నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు వాడపల్లి ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. దామరచర్ల మండలం బొల్లిగుట్టతండా, శూన్యంపహాడ్ గ్రామాలకు చెందిన లావూరి సాల్మన్, విజయ్, నాగుల్‌మీరా మిర్యాలగూడ మండలంలోని తెట్టెకుంట గ్రామ శివారులోని మూసీ నది నుంచి ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తుండగా వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులకు పట్టుబడ్డారు. ఈ మేరకు వాహనాలను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ల యజమానులు లావూరి సాల్మన్, విజయ్, నాగుల్‌మీరాలపై కేసు నమోదు చేశారు.

ఇరు కుటుంబాల మధ్య ఘర్షణ

నల్లగొండ: పాత బస్తాల వ్యాపారానికి సంబంధించి కుటుంబ సభ్యుల మధ్య తగాదా మొదలై దాడులు చేసుకున్న నల్లగొండ పట్టణంలోని శివాజీనగర్‌లో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన అన్నదమ్ములు శివాజీనగర్‌లో పక్కపక్క షాపులు ఏర్పాటు చేసుకుని పాత బస్తాలు కుట్టే వ్యాపారం చేస్తున్నారు. ఆదివారం ఒక వ్యక్తి బస్తాలు కొనేందుకు అన్న శ్రీనివాస్ షాపునకు వెళ్లి బస్తాలు చూడగా.. నచ్చకపోవడంతో పక్కనే ఉన్న తమ్ముడు సత్తిబాబు షాపులో బస్తాలు కొన్నాడు. ఆ సమయంలో సత్తిబాబు కూతురు రేణుక దుర్గ, వర్కర్ ఉన్నారు. తనకొచ్చే గిరాకిని నువ్వు ఎలా తీసుకుంటావంటూ శ్రీనివాస్ వర్కర్‌తో గొడవ పడ్డారు. తమ్ముడి కూతురు రేణుక దుర్గ అడ్డుకోగా ఆమెను నెట్టివేశాడు. తమ్ముడి భార్య అయిన భార్గవి అక్కడికి రావడంతో బావ శ్రీనివాస్ ఆమెను కూడా నెట్టివేయడంతో తలకు గాయమైంది. ఈ విషయాన్ని వారు సత్తిబాబుకు తెలియజేయడంతో అతడు వచ్చి అన్న శ్రీనివాస్‌ను నెట్టేయడంతో అన్నకు గాయాలైనట్లు సమాచారం. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఎంబీబీఎస్ విద్యార్థినికి ఐప్యాడ్ అందజేత

నల్లగొండ: ఎంబీబీఎస్ మూడో సంవత్సరం చదువుతున్న పేద విద్యార్థిని కౌశికకు లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ నోబుల్ ఆధ్వర్యంలో ఆదివారం నల్లగొండ పట్టణంలోని లయన్స్ భవన్‌లో రూ.50 వేల విలువ చేసే ఐ ప్యాడ్‌ను పీఎంజేఎఫ్ లయన్ కేవీ ప్రసాద్, కోడె సతీష్‌కుమార్ అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు మిర్యాల యాదగిరి, విష్ణు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మూలమలుపులు



చెన్నారం గేటు సమీపంలో ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు

- హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో నెలకొంటున్న ప్రమాదాలు
- ఇప్పటికే పలువురు గాయపడగా.. మరికొందరు మృత్యువాత

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి మండలంలో పలు చోట్ల మూలమలుపులు ప్రమాదకరంగా మారాయి. చెన్నారం గేటు వద్ద, కేశ్యతండా వద్ద, జోగ్యతండా సమీపంలో, కొత్తబావి గేటు సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద, దోనియాల సమీపంలో ప్రమాదకర మూలమలుపులతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికే ప్రమాదాల్లో పలువురు క్షతగాత్రులుగా మారగా మరికొందరు మృత్యువాతపడ్డారు. ప్రమాదాల నివారణకు మూలమలుపుల వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉన్నప్పటికీ కొన్ని చోట్ల మాత్రమే ఏర్పాటు చేయగా మిగతా చాలా చోట్ల చర్యలు తీసుకోలేదు. ప్రమాదకర మూలమలుపుల వద్ద వేగ నియంత్రణ చర్యలు చేపట్టడంతో పాటు ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను కోరుతున్నారు.

నిత్యం రద్దీ..

ఇటీవల సాగర్ నిండడంతో తరచూ గేట్లు తెరుస్తుండడంతో రాష్ట్ర రహదారి రద్దీగా ఉంటుంది. సాగర్‌ను సందర్శించేందుకు వేర్వేరు ప్రాంతాల నుంచి కార్లలో వస్తుండడంతో ఈ రహదారి ట్రాఫిక్ జామ్ అవుతుండడం సర్వసాధారణమైంది. ఈ క్రమంలో ప్రమాదాలు చోటు చేసుకోకుండా సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రమాద నివారణ చర్యలు తీసుకోవాలి

కొండమల్లేపల్లి మండలంలో హైదరాబాద్–నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారిపై ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి. అవసరమైన మూలమలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. పోలీసులు వాహనాల తనిఖీ చేపడితే ప్రమాదాల సంఖ్యను చాలా వరకు తగ్గించవచ్చు.

– యాదగిరి, కొండమల్లేపల్లి

ఇటీవల జరిగిన కొన్ని ఘటనలు..

- చెన్నారం గేటు సమీపంలో బైక్ వేగాన్ని అదుపు చేయలేక ప్రమాదానికి గురి కాగా ఈ ఘటనలో తండ్రి కొడుకులు మృత్యువాతపడ్డారు.
- కొండమల్లేపల్లి మండలంలోని కొత్తబావి సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద గతంలో జరిగిన రెండు కారు ప్రమాదాల్లో నలుగురు మృత్యువాతపడ్డారు.
- గతంలో జోగ్యతండ సమీపంలోని మూలమలుపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు.
- దోనియాల గేటు సమీపంలో కారు బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృత్యువాతపడ్డారు.



కేశ్యతండా సమీపంలో..



జోగ్యతండా సమీపంలో..

సబ్ రిజిస్ట్రార్‌గా బొజ్జ శ్యామ్



నియామకపత్రం అందుకుంటున్న శ్యామ్

నిడమనూరు : నిడమనూరు మండలం శాఖాపురం గ్రామానికి చెందిన బొజ్జ శ్యామ్ గ్రూప్–2లో 351 మార్కులతో రాష్ట్రస్థాయి ఎస్సీ కేటగిరిలో 89వ ర్యాంకు సాధించారు. దీంతో నారాయణపేట జిల్లా సహకార సంఘం సబ్ రిజిస్ట్రార్‌గా నియామకమయ్యారు. బుధవారం సహకార సంఘాల కమిషనర్ సురేంద్ర మోహన్ నుంచి నియామక పత్రం అందుకున్న ఆయన దీపావళి అనంతరం గురువారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

జేవీవీ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం



రోగులకు మందులు అందజేస్తున్న జేవీవీ ప్రతినిధులు

మిర్యాలగూడ: మిర్యాలగూడ పట్టణంలోని నవజ్యోతి పాఠశాలలో ఆదివారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఫిట్స్, పక్షవాతం, బీపీ, షుగర్ రోగులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య శిబిరానికి వచ్చిన 270 మందికి ప్రముఖ న్యూరో ఫిజిషియన్ డాక్టర్ గోపాలం శివన్నారాయణ వైద్యపరీక్షలు చేశారు. వారికి అవసరమైన మందులను దాత కోల ప్రకృత్ దివ్యశ్రీ అందజేశారు. కార్యక్రమంలో జేవీవీ ప్రతినిధులు పాదూరి రమణారెడ్డి, సత్యనారాయణరావు, కృష్ణమూర్తి, ప్రశాంతి, వేదశ్రీ, శోభ, నసీమా, శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణారావు, అమరయ్య, కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బంద్‌కు సహకరించిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు

మిర్యాలగూడ టౌన్ : బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బీసీ జేఏసీ పిలుపు మేరకు నిర్వహించిన బంద్‌ను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. రాజకీయ పార్టీలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంఘాల వారికి ధన్యవాదాలు తెలిపారు.

ఒకే ఈతలో రెండు ఆవు దూడలు



నిడమనూరు: నిడమనూరు మండలం వెనిగండ్ల గ్రామానికి చెందిన రైతు కుర్రపిడత పురుషోత్తంకు చెందిన ఆవు ఆదివారం సాయంత్రం ఒకే ఈతలో రెండు దూడలకు జన్మనిచ్చింది. స్థానికులు వీటిని చూసేందుకు ఆసక్తి కనబరిచారు. జన్యులోపాల కారణంగా కవల దూడలకు జన్మనిస్తాయని పశు వైద్య సంచాలకుడు వెంకట్‌రెడ్డి తెలిపారు.

వంట చేసేదెట్లా?

కొండమల్లేపల్లి : మండలంలోని కొత్తబావి గ్రామంలో గల ప్రాథమిక పాఠశాలలో వంట గది కరువైంది. పాఠశాలలో ఉన్న వంట గదికి రేకులు లేకపోవడంతో మధ్యాహ్న భోజన నిర్వాహకులు వంట చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారు. వర్షం కురిసిన రోజు ఇంటి వద్దే వంట చేసుకుని తీసుకు రావాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.



కొత్తబావి ప్రాథమిక పాఠశాలలో రేకులు లేని వంట గది

వరద తగ్గింది.. బురద మిగిలింది

గుర్రంపోడు : వరుస వర్షాలతో తహసీల్దార్ కార్యాలయ ఆవరణ జలమయం అయింది. వరద రాక తగ్గినా, ఆవరణ అంతా బురదమయంగానే ఉంది. కార్యాలయ ఆవరణ మొత్తం రోడ్డు కంటి ఎత్తులో మట్టిని నింపడమే శాశ్వత పరిష్కారమైనప్పటికీ నిధులు సమస్య ఉందని అధికారులు పేర్కొంటున్నారు.



బురదమయంగా తహసీల్దార్ కార్యాలయ ఆవరణ

కల్వర్టు కుంగింది

గుర్రంపోడు: మండల కేంద్రం నుంచి పిట్టలగూడెం, వట్టికోడు, కస్తాల తదితర గ్రామాల మీదుగా చండూరు మండల కేంద్రాన్ని కలిపే ప్రధాన రహదారి పూర్తిగా దెబ్బతిన్నది. ఈ దారిలో ఉన్న కల్వర్టులు కుంగి ప్రమాదాలు పొంచి ఉన్నాయి. చామలేడు, పిట్టలగూడెం గ్రామాల పరిధిలో రాతి కడీలు వేసి నిర్మించిన కల్వర్టులు కుంగడంతో వాహనదారులు భయం భయంగా ప్రయాణించాల్సి వస్తోంది.



గుర్రంపోడు- చండూరు దారిలోని పిట్టలగూడెం శివారులో కుంగిన కల్వర్టు